క్లుప్తంగా

వేడుకగా నారాయణస్వామి ఆరాధన



పొదలకూరు: పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప దేవగిరి క్షేత్రంలో వెంకయ్యస్వామి ప్రథమ శిష్యుడు నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలను వేడుకగా బుధవారం నిర్వహించారు. నిత్యపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి తదితరాలను జరిపారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. నిర్వాహకులు గుండ్రా జనార్దన్‌రెడ్డి దంపతులు, తరుగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న పరామర్శ



విడవలూరు : మండలంలోని ఊటుకూరు పల్లిపాళెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెయ్యాల వెంకటేశ్వర్లు మాతృమూర్తి పోలమ్మ పెద్దకర్మలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించి పోలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పార్టీ నేతలు పొన్నపోలు కృష్ణారెడ్డి, కొండూరు సాగర్‌రెడ్డి, కోమట్ల రమణారెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం



గాంధీ నెవావత్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ మెరైన్ బయాలజీ విభాగ పరిశోధన విద్యార్థి గాంధీ నెవావత్‌కు డాక్టరేట్‌ను వర్సిటీ బుధవారం ప్రదానం చేసింది. స్టడీస్ ఆన్ ది మాలెక్యులర్ రెస్పాన్స్ ఆఫ్ మెరైన్ ఫిషెస్ అండర్ ఇండస్ట్రియల్ గాసోస్ ఏమిషన్స్ అనే అంశంపై మెరైన్ బయోలజీ విభాగ అధ్యాపకురాలు విజయ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దీంతో రెండో డాక్టరేట్‌ను సాధించారు. ఆయన్ను వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ అభినందించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని ముంబై రోడ్డుపై ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళేనికి కారు వస్తుండగా ఓ కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే కారులోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

బైక్‌ల దొంగ అరెస్ట్



నిందితుని వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్) : టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌లను దొంగలించి కళ్లుగప్పి తిరుగుతున్న ఓ పాతనేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు బుధవారం నిందితుని వివరాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వైఎస్సార్ నగర్‌కు చెందిన చిన్నబ్బాయి పాతనేరస్తుడు. ఆయన బుధవారం ఇరుకళల పరమేశ్వరి గుడి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా చిన్నబజారు, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం నిందితుడిని తమదైన శైలిలో విచారించగా చిన్నబజారు పోలీసుస్టేషన్, నవాబుపేట, తిరుపతి జిల్లా గూడూరు టు టౌన్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌లను దొంగలించినట్లు నేరం అంగీకరించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి నాలుగు మోపెడ్‌లను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్సై అయ్యప్ప పాల్గొన్నారు.

సంక్షోభ గృహం

దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు సరైన వసతులను కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందింది. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాలు మరీ దయనీయ స్థితిలో ఉన్నాయి. ఇక్కడ కనీసం నిత్య కృత్యాలను కూడా తీర్చుకునే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కాదు.

- అధ్వానంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు
- నరకయాతన అనుభవిస్తున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం

బుచ్చిరెడ్డిపాళెం: నియోజకవర్గంలోని కోవూరులో 5 ఎస్సీ హాస్టల్స్, ఇందుకూరుపేటలో 1, బుచ్చిరెడ్డిపాళెంలో 5 ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో ఒక్కో హాస్టల్లో వంద మందికిపైగా విద్యార్థులు ఉంటున్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉండగా అందులో ఆరో తరగతి లోపు విద్యార్థులు అధిక శాతం మంది సీట్లను పొందారు.

దయనీయ స్థితిలో..

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థులకు నరకం చూపిస్తోంది. ఇక్కడి మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని డోర్లు విరిగిపోయి రోజుల తరబడి శుభ్రం చేయకపోవడంతో వినియోగంలో లేకుండా ఉంది. స్నానాలు చేయాలన్నా గదులు సక్రమంగా లేవు. దీంతో విద్యార్థులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అల్లాడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం, వారు ఉండే వసతి గృహాల నిర్వహణ కోసం ఏటా రూ.లక్షల వెచ్చిస్తోంది. అయినా వసతి గృహాలు మాత్రం బాగుపడడం లేదు. దీంతో వసతి గృహాల్లో చేరేందుకు కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి కనపరచడం లేదు. ఇక్కడి సమస్యలపై హాస్టల్ వార్డెన్‌కు విద్యార్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు కూడా వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా మౌనం వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వంద మంది విద్యార్థులు ఉన్న ఈ వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో ఉన్న పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారా..? లేదా అనేది కూడా వార్డెన్ పరిశీలించకపోవడం గమనార్హం.

పర్యవేక్షణ కరువు

ఇక్కడి 5, 6 తరగతుల విద్యార్థులు హాస్టల్‌కు, పాఠశాలలకు మధ్యలో ఉన్న పాడుపడిన భవనాల పైన, చెట్లపైన ఎక్కి ఆడుకోవడం తరుచూ కనిపిస్తుంది. ఉదయం, సాయంత్రం మాత్రం ఓ అరగంట హాస్టల్‌లో గడిపి వెళ్లడం వార్డెన్‌కు నిత్య కృత్యంగా మారినట్లు తెలుస్తోంది. ఈ హాస్టల్‌లో వార్డెన్ దివ్యాంగుడు కావడంతో ఏమీ అనలేక పోతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతుల గురించి వార్డెన్‌ను ప్రశ్నిస్తే ప్రతిపాదనలు పంపాము.. అంటూ సమాధానమిస్తున్నాడని తెలిపారు.

జిల్లా అధికారి ఆగ్రహం

నెలన్నర క్రితం ఓ జిల్లా అధికారిణి వసతి గృహాన్ని తనిఖీ చేసి ఇలాగేనా నిర్వహణ చేసేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో నిధులు లేవని వార్డెన్ చెప్పడంతో రూ.60 వేలు మంజూరు చేయడంతో వెంటనే పనులను ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. అయితే రెండు కుళాయిలు వేయగా అందులో ఒకటి విరిగిపోయి ఒకటి మాత్రమే పనిచేస్తుంది. వంద మంది పిల్లలు స్నానం చేసేందుకు ఆ కుళాయినే వాడుకోవడం, తాగేందుకు కూడా అదే నీటిని వాడడం అత్యంత దయనీయంగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్‌కు సరైన వార్డెన్‌ను నియమించి స్నానపు గదులు, మరుగుదొడ్లను నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఏర్పాటు చేసిన కొద్ది కాలానికే విరిగిపోయిన కుళాయి



మరుగుదొడ్లకు సక్రమంగా లేని దోర్లు



వసతి గృహంలో అధ్వానంగా మరుగుదొడ్లు



తరగతులు జరిగే సమయంలో ఆడుకుంటున్న విద్యార్థులు

పలువురికి కాకాణి పరామర్శ



వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం, చవటపాళెం గ్రామాల్లో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పర్యటించారు. నిడిగుంటపాళేనికి చెందిన నెల్లూరు తులసీరామ్ లోక్‌నాథ్‌సింగ్, చవటపాళేనికి చెందిన తాళ్లపాక నరసయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో వీరి కుటుంబాలను ఆయన పరామర్శించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, ఎంపీపీ మందా కవిత, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, పైనం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : పంట నమోదు చేసుకున్న రైతులు ఈ–కేవైసీ కూడా చేయించుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని దామేగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈ–కేవైసీ కూడా పూర్తి చేసుకున్న రైతుల వివరాలను మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపుతామన్నారు. మండలంలో 40 శాతం మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏ బి.లిఖిత పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు సర్టిఫికెట్ల పరిశీలన



కొడవలూరు : బీసీ రాయితీ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పరిశీలించారు. మండలంలోని బీసీలకు 30 రాయితీ రుణాలు కేటాయించగా 252 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా సర్టిఫికెట్ల పరిశీలనకు 194 మంది దరఖాస్తుదారులు హాజరవ్వగా, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, ఏఓ రామ్‌ప్రసాద్, బ్యాంక్ అధికారులు పరిశీలన చేశారు.

ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద



కొడవలూరు : ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపదను తయారు చేయాలని డీపీఓ శ్రీధర్‌రెడ్డి సూచించారు. కొడవలూరులోని సంపద తయారీ కేంద్రంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన మేజర్ పంచాయతీల కార్యదర్శులకు చెత్త నుంచి సంపద తయారు చేయడంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపదను తయారు చేయడం ద్వారా పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకోవాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ రమేష్ ప్రతి ఇంటి నుంచి చెత్తను ఏ విధంగా వేరు చేసి కేంద్రానికి తరలించాలి, సంపదగా ఎలా తయారు చేయాలన్న విషయంపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌పీఓలు మాధవీలత, రమణయ్య, కృష్ణమోహన్, నయీమ్, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, సర్పంచ్ నలబాయి కామాక్షి, ఎంపీటీసీ ఎస్.ప్రతాప్, ఎంఆర్సీ మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి





విడవలూరు : మండలంలోని రామతీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక రామలింగేశ్వరుని ఆలయం వద్ద స్థానిక యూత్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ఆ ప్రాజెక్ట్ ఇంజినీర్లు బుధవారం తెలిపారు. అందులో భాగంగా 1వ యూనిట్లో 425 మెగావాట్లు, 2వ యూనిట్లో 560 మెగావాట్లు, 3వ యూనిట్లో 630 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

రికార్డుల పరిశీలన నేడు

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ రికార్డులను నెల్లూరు డీఎల్పీఓ రమణయ్య గురువారం పరిశీలించనున్నారు. పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అయ్యాయంటూ పట్టణానికి చెందిన పలువురు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణాధికారిగా డీఎల్పీఓను డీపీఓ నియమించారు. ఈ మేరకు పంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించనున్నారు.

సెమిస్టర్ పరీక్షలకు ఐదుగురి గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ మూడో, ఆరో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ వెంకట్రాయులు తెలిపారు. 207 మందికి గానూ 202 మంది హాజరయ్యారని చెప్పారు.

సజావుగా వ్యాపారాలు చేసుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సజావుగా వ్యాపారాలు చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో తోపుడు బండ్ల వ్యాపారస్తులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ నిర్మాణం పూర్తయ్యే వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చెన్నూరు రోడ్డులో వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బుచ్చి కమిషనర్ బాధ్యతల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా డబ్బుగుంట బాలకృష్ణ తన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ శుభాకాంక్షలు తెలిపారు.



పంట నమోదు కీలకం



మాట్లాడుతున్న సత్యవాణి

ముత్తుకూరు: పంట నమోదుతో పాటు కేవైసీని రైతులు తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి కోరారు. మండలంలోని పొట్టెంపాడులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఏడీఏ నర్సోజీతో కలిసి ఆమె హాజరయ్యారు. పొలాలు, వినియోగిస్తున్న ఎరువులను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు కేటాయిస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య ధాన్యం కొనుగోలు సమయంలో చాలా ప్రాధాన్యాన్ని సంతరించుకుందని వివరించారు. వరిలో వ్యాపిస్తున్న తెగుళ్లు, పురుగుల సమస్యలను తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి, వీఏఏలు శ్రీకాంత్, ప్రసన్నకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న మౌనిక థామస్

మనుబోలు: ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలను క్రమం తప్పకుండా వేయాలని జిల్లా సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ మౌనిక థామస్ పేర్కొన్నారు. మండలంలోని కాగితాలపూరు, కొండూరుసత్రం, బండేపల్లిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. టీకాల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీహెచ్‌ఓ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వైద్య పరికరాల వితరణ



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీకి రూ.రెండు లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. హైడ్రాలిక్ బెడ్‌కాట్, వీల్‌చైర్స్, ఆపరేషన్ థియేటర్ టేబుల్, స్టాండింగ్ బీపీ ఆపరేటర్, నార్మల్ బెడ్ కాట్లను రీజినల్ మేనేజర్ అరుణ్‌కుమార్, పొదలకూరు మేనేజర్ రాజు ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడారు. సీఎస్సార్ నిధులతో వీటిని అందజేశామని వివరించారు. రీజినల్ హెచ్‌ఆర్ మేనేజర్ వివేక్, వైద్యాధికారులు నరసింహారావు, శ్రీకావ్య తదితరులు పాల్గొన్నారు.

ఇజ్తిమా విజయవంతానికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు : రాష్ట్రస్థాయి ఇజ్తిమాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మండలంలోని చంద్రశేఖరపురంలో ఇజ్తిమా ఏర్పాట్లను ముస్లిం మత పెద్దలతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లక్షలాదిగా భక్తులు వచ్చే ఇజ్తిమా కోవూరు నియోజకవర్గంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో జరిగే ఇజ్తిమాకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా మౌలిక వసతులను కల్పించడంతో పాటు భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు, వాకీటాకీలు ఏర్పాటు చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్య, మైనారిటీ నాయకులు జాకీర్ షరీఫ్, ఇంతియాజ్, జహంగీర్, నాయకులు సతీష్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, సుధాకర్, కిశోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడోత్సవాలు



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వార్షిక క్రీడోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమైంది. సాఫ్ట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ మొదలైన క్రీడలను నిర్వహించారు. తొలుత ప్రిన్సిపల్ బి.సుజాత జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు.